క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీ విద్య

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఏపీఓ శేషన్నతో కలిసి ఏపీడీ శ్రీ విద్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి హామీల కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 5:30 గంటలకు పని ప్రదేశానికి చేరుకొని 10:30 గంటలకు పూర్తి చేసుకోవాలన్నారు. ఉపాధి కూలి రూ.272నుంచి రూ.300 పెంచడం జరిగిందని, కొలతల ప్రకారం పనులు చేసుకోవానలి సూచించారు.

ఐదుగురు వలంటీర్లు రాజీనామా



ఎంపీడీఓ రవి ప్రసాద్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు సూర్య, తెలుగు మనోహర్, హరిష్‌రెడ్డి, రాజశేఖర్, సుధాకర్ మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రవి ప్రసాద్ కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున సేవల్లో అంతర్భాగంగా ఇనాళ్ల అంకిత భావంతో సేవలందించాం. సొంత గ్రామంలోనే సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పార్టీలు మాపై పగబట్టినట్లుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి మాపై చేస్తున్న దుష్ప్రచారాన్ని భరించలేక రాజీనామా చేశామన్నారు.

సర్వాయి సర్దార్ పాపన్న వర్ధంతి



పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో ఈడిగ(గౌడ) సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 314వ వర్ధతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఫోర్ లైన్స్ రోడ్డుపై ఏర్పాటు చేసిన సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన బ్రిటీష్ వారిపై చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వాయునందన గౌడ్, తిరుపాల్‌గౌడ్, దొంతా వెంకటేశ్వర్లు, భాష్యం విజయ్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్, భాష్యం యల్లయ్యగౌడ్, సంజీవగౌడ్, బీమలింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మద్దయ్య, నాయకులు

బనగానపల్లె రూరల్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ మద్దయ్య అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, చంద్రశేఖర్, శ్రీరాముల బాలచెన్నయ్య, మండ్ల రఘురామిరెడ్డి, వై రఘురామిరెడ్డి, నాగేష్, సుబ్బయ్య, జోహర్, మధు, రాజేష్, కుమారస్వామి, బాలయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



శిలా ఫలకంలో వివరాలు కనపడకుండా పేపర్లు అతికిస్తున్న దృశ్యం

సంజామల: ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి, ఎంపీడీఓ నాగకుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ పర్యటించారు. ఇళ్ల దగ్గర పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, జెండాలు ఉంటే తప్పనిసరిగా అనుమతి పొందాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామంలో అనుమతి లేకుండా ఎలాంటి బ్యానర్లు కట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాబూ... ఇది తగునా?

- మేము ఏం పాపం చేశామని పింఛన్ పంపిణీని అడ్డుకున్నావ్
- ఏంటీ ఓర్వలేని తనం... అనుభవిస్తావ్
- శాపనార్థాలు పెడుతున్న అవ్వాతాతలు, వితంతులు, దివ్యాంగులు

డోన్ : అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితరులు ఒకటవ తేదీన ఠంచన్‌గా పింఛన్ అందుకునే ప్రక్రియకు చంద్రబాబు కుట్రల మూలంగా అడ్డుకట్ట పడింది. ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు కుతంత్రాలతో స్వచ్ఛంద కుట్రకు తెరలేపాడు. ఇందులో భాగంగా ఓ స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు మేరకు ఎన్నిక కమిషన్ వలంటీర్లను పింఛన్ పంపిణీకి దూరం పెట్టింది. దీంతో ఇళ్ల వద్దనే పింఛన్ ప్రక్రియ నిలిచిపోయింది. పింఛన్‌లబ్ధిదారులు చంద్రబాబు తీరును తప్పుపడుతున్నారు. బాబూ... ఇది నీకు తగునా అంటూ నిలదీస్తున్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలే తప్పా... మాపై మీ ప్రతాపం ఏంటీ... మేము ఏం పాపం చేశామని ఇలా ఆడుకుంటున్నావంటూ ప్రశ్నిస్తున్నారు అభాగ్యులు. టీడీపీ పాలనలో ఎలాగో ఇబ్బందులు పడ్డాం... మా బాధలు గుర్తించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటవ తేదీన పొద్దున్నే జీతంలా పింఛన్ సొమ్ము అందుతుంది. దీన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా... అంటూ లబ్ధిదారులు నిలదీస్తున్నారు. నీవు ఆదుకోవు... ఆదుకుంటున్న వారిని అడ్డుకుంటావా... ఇలా చేయడం ఏమైనా న్యాయమాఅని ప్రశ్నిస్తున్నారు. మా ఉసురు మీకు తప్పక కొట్టుకుంటుంది బాబు... అంటూ శాపనార్థాలు పెడుతున్నారు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు తదితర పింఛన్ లబ్ధిదారులు.



మానసిక వికలాంగుడైన చిన్నారికి ఐరిస్ తీస్తున్న వలంటీర్(ఫైల్)

వలంటీర్ల సేవలు స్వచ్ఛందం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్ల సేవలు స్వచ్ఛందమైనవి. ప్రతి నెల 1వ తేదీన జీతంలా పింఛన్ మొత్తాన్ని మా చేతికి అందించి ఆప్యాయంగా పలకరించే వలెంటీర్లపై చంద్రబాబు విషం కక్కుతుండడం దారుణం. మా ఇబ్బందులు ఏమాత్రం పట్టించుకోకుండా పింఛన్ల పంపిణీకి అడ్డుపడటం ఆయన దుర్మార్గపు చర్యకు నిదర్శనం. మా గోడుకొట్టుకుని అనుభవిస్తాడు.– **కుమ్మరి లక్ష్మీదేవి, డోన్.**

బాబు...మానవత్వం లేని మనిషి



చంద్రబాబు మానవత్వం లేని మనిషి అని మరోమారు నిరూపించుకున్నాడు. వృద్ధులు, అచేతనావస్థలో ఉన్నవారికి ప్రభుత్వ పింఛన్ అందకుండా అడ్డుకోవడం అన్యాయం. కనీసం మానవత్వం లేకుండా వలంటీర్లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం చంద్రబాబు రాక్షసత్వానికి నిదర్శనం. ఇలా చేయడంతోనే మాకు పింఛన్ అందలేదు. మా ఉసురు తప్పక తగులుతుంది.

–బోయ కాశమ్మ, డోన్.

ఎందుకు ఓర్వలేకపోతున్నారు?



టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం రచ్చబండలు, చావిళ్లు, పాఠశాలలు, చెట్ల కింద గంటల తరబడి నిరీక్షించాం. ఒక్కోసారి రెండు, మూడు రోజులు నిరీక్షించిన సందర్భాలూ ఉన్నాయి. మా బాధలు గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వలంటీర్ల ద్వారా ఇళ్ల దగ్గరికే పింఛన్ అందజేస్తున్నారు. మీరెలాగో చేయలేరు... చేసేవారిని అడ్డుకోవడం అన్యాయం. అభాగ్యులకు మంచి జరిగితే ఓర్వలేరా. **–నిర్మలాబాయి, డోన్.**

వైఎస్సార్‌సీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణ మూర్తి తదితరులు తెలిపారు. మండల పరిధిలోని కలచట్లలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూడా సమ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగు, తాగు నీరు అందించడమే ధ్యేయంగా కృషి చేశారన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే ప్రజలు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, కొండయ్య, సోమశేఖర్, రామ్మూర్తి, నాగరాజు, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రామతీర్థం గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. మంగళవారం బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో పొణ్యం నబిసా, మాఫిరా, హుస్సేన్‌సా, తిమ్మనాయుడు, బాబు, చిన్నవలి, ఇర్ఫాన్, మహమ్మద్, దాదాబాషా, ఇమాములు, ఖాసీం, మహమ్మద్ ఖాసీం, సుబ్బరాయుడు, చాగలమర్రి హుస్సేనప్ప, మద్దిలేటి, అబ్దుల్‌తో పాటు మరికొందరు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండవా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో పార్టీలు, కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. రామతీర్థం గ్రామంలో వంద ఎకరాలను పేదలకు పంపిణీ చేయడంతో పాటు ఇంటి స్థలాలను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రామతీర్థం సర్పంచ్ సురేష్ నాయుడు, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు బషీర్ అహమ్మద్, ఇమాంఖాసీం, తిమ్మరాజు, పక్కిర్‌సాహెబ్, సుబ్బారావు, సుబ్బారెడ్డి, దస్తగిరియ్య, మద్దిలేటి, మర్రి బాలమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గుంటూరు జిల్లా వృషభాలు



విజేత వృషభాల యాజమానికి నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో వెలసిన గణపతి సహిత సోమేశ్వర, లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయాల మండల ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల్లో గుంటూరు జిల్లా వృషభాలు సత్తా చాటాయి. గుంటూరు జిల్లా మేడికొండూరు చెందిన విజయపవన్ వృషభాలు నిర్ణీత 15 నిమిషాల వ్యవధిలో 5,652 అడుగులు లాగి ప్రథమ స్థానంలో రూ. 40 వేలు కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా చిన్నకొత్తపల్లి భాస్కర్‌రెడ్డి వృషభాలు 5,400 అడుగులతో రెండవస్థానంలో రూ. 30వేలు, డోన్‌కు చెందిన గురునాథ్ వృషభాలు 4,920 అడుగుల దూరంతో మూడవస్థానంలో రూ. 20వేలు గెలుపొందాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రాయవరం అనన్యరెడ్డి వృషభాలు 4,704, డోన్ మండలం కొచ్చెరువుకు చెందిన మధు వృషభాలు 4,576 అడుగులు లాగి తర్వాతి స్థానాల్లో నిలిచి రూ. 10వేలు, రూ. 5వేలు దక్కించుకున్నాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు సర్పంచ్ ఏర్వ సంజమ్మ, ఉపసర్పంచ్ డీవీ శేషిరెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. పోటీలకు వ్యాఖ్యాతగా కడపకు చెందిన చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్వ శేషిరెడ్డి, ఏర్వ వెంగళరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బైరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బెక్కెం ప్రతాప్‌రెడ్డి, చిన్న సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



హనుమాన్ నగర్‌లో వృద్ధుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: పేదల గడపవద్దకే సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్నే మళ్లీ సీఎం చేసుకుందామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలీ, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి ఆధ్వర్యంలో బుగ్గన అర్జున్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మంత్రి బుగ్గన సారథ్యంలో జరిగిన విద్య, వైద్యం రంగాలోపాటు గ్రామీణ రహదారుల అభివృద్ధిని వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న తాగునీటి సమస్యకు రూ. 351 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు తెచ్చి మంత్రి బుగ్గన శాశ్వత పరిష్కారం చూపారని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఖాజా, నాయకులు గూని నాగరాజు, మధు సూధన్‌రెడ్డి, శేఖరయ్య, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరావు, బొల్లి మద్దిలేటి, సాయి కిరణ్, వలీ బాషా, అజ్మతుల్లా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె రూరల్ : వేసవి కాలంలో వడదెబ్బ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. మంగళవారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా నీడ ప్రదేశాలు ఉండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు ఏదైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే స్పందించాలని ఆశాలకు సూచించారు. ఆశా వర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకుని అవసరం ఉన్న వారికి అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్‌బాబు, ఎంపీహెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

సంజామల: పద్దెనిమిదేళ్లు నిండిన యువతి,యువకులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు ఓటు హక్కు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : చిన్నమల్కాపురం సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న మల్కాపురం, పెద్ద మల్కాపురం, ఎర్రగుంట్ల, కమలాపురం, వలిసెల గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న శివ స్వాములు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ మసీద్‌లో మంగళవారం శివ స్వాముల కమిటీ సభ్యులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులకు శివ స్వాములు స్వయంగా ఇఫ్తార్ విందు వడ్డించారు. హిందూ, ముస్లిం లు సోదర భావంతో మెలగాలనే సదుద్దేశంతో ఇఫ్తార్ విందు ఇచ్చామని శివ స్వామి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మతసామరస్య చైతన్య వేదిక సభ్యులు నూర్ అహ్మద్, జయంత్ గౌడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



జోజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ యమ్మనూరు జోజమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వెంటనే గ్రామానికి వెళ్లి జోజమ్మ మృతదేహానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, యమ్మనూరు మనోహర్‌రెడ్డి, బసప్ప, మదర్‌సా, జగదీశ్వర్‌రెడ్డి, రాంమ్మోహన్‌రెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వృక్షం... స్తంభించిన రాకపోకలు



రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షం కొమ్మలను తొలగిస్తున్న వలంటీర్ శివరాం

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని సమీపాన ప్రధాన రహదారిలో వేప చెట్టు నేల కూలింది. రోడ్డుపై అడ్డంగా పడడంతో రాకపోకలు స్తంభించాయి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అటు వైపు వెళ్తున్న ముచ్చల పూరి గ్రామ వలంటీర్ శివరాం వెంటనే స్పందిచాడు. రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం కొమ్మలను ఒక్కక్కటిగా కొడవలితో తొలగించాడు. దీంతో రాకపోకలు సాఫీగా సాగాయి. వాహనచోదకులు వలంటీర్ శివరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

బనగానపల్లె నవాబు వంశీయులను కలిసిన ఎమ్మెల్యే కాటసాని



నవాబు మీర్‌ఫజల్ అలీఖాన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్‌ఫజల్ అలీఖాన్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నవాబుకోటలోని మీర్ ఫజల్‌అలీఖాన్ ఇంటికి ఎమ్మెల్యే కాటసాని వెళ్లి త్వరలో జరుగు వచ్చే ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, షియా మతగురువు మౌలానా తషఖుర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



కోవెలకుంట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కర్రా గిరిజ, కాటసాని మేధాశ్రీరెడ్డి

కోవెలకుంట్ల: నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వాదించాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోడలు మేధాశ్రీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని నాగులకట్టవీధి, ఇందిరానగర్, సాయినగర్, ముదిగేడు టర్నింగ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ తదితరులతో కలిసి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజలకు చేసిన మంచిని ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అవ్వా, తాతలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు తలుపు తట్టి ఫించన్లు అందజేశారన్నారు. పండుటాకులపై కక్షకట్టిన చంద్రబాబు వలంటీర్లపై అక్కసుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీ చేయకుండా అడ్డుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, జోళదరాశి సర్పంచ్ ఈర్నపాటి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, అక్బర్‌బాష, సుధాకర్‌రెడ్డి, రమేష్, సుబ్బయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



29వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి



30వ వార్డులో వృద్ధుడితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని 29వ వార్డులో కౌన్సిలర్లు వెంకట్రాముడు, ఆర్ట్ రమణ, మేకల విమల ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునగౌడ్, భాస్కర్, రమేష్, సుంకన్న, మాబు, వడ్డె రంగస్వామి, ఎల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నను ఆశీర్వదించండి

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోమారు ఆశీర్వాదించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రజలను కోరారు. స్థానిక 30వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, డీలర్ క్రిష్ణ, ప్రతాప్‌రెడ్డి, బోయ సురేష్, వంశి, బలిజ సురేష్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను చైర్మన్ అభ్యర్థించారు.

పొదుపు రుణాల స్వాహాపై విచారణ

- బ్యాంక్ వద్ద ఆందోళనకు దిగిన బాధిత మహిళలు
- రూ.20 లక్షలకు పైగానే స్వాహా అయినట్లు వెల్లడి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో పొదుపు గ్రూపు రుణాల స్వాహాపై మంగళవారం ఏపీఎం తిరుపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. బాధిత మహిళలతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరుడు కార్తీక్ అనధికారికంగా బుక్‌కీపర్ అవతారమెత్తి పొదుపు మహిళల డబ్బును బ్యాంక్‌లో వాయిదాలు చెల్లించకుండా చేతి వాటం ప్రదర్శిస్తూ వచ్చాడు. జననీ గ్రామైక్య సంఘంలో 27 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఈ పొదుపు గ్రూపులకు చెందిన మహిళలు బ్యాంక్‌లో రూ.5నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. పొదుపు మహిళల అమాయకత్వం, నిరక్ష్యరాస్యతను ఆసరాగా చేసుకున్నాడు కార్తీక్. ప్రతి నెలా మహిళలు తీసుకున్న రుణాలకు క్రమం తప్పకుండా వాయిదా డబ్బులు అతనికి ఇస్తుండేవారు. ఇటీవలనే ఒకరిద్దరి గ్రూపు సభ్యులు కంతులు పూర్తి కావడంతో మళ్లీ రుణాలు తీసుకోవాలని కార్తీక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఏవో కారణాలు చెబుతూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. చివరకు మహిళలు బ్యాంక్‌కు వెళ్లి విచారించారు. చాలా బకాయి ఉందని బ్యాంక్ సిబ్బంది చెప్పడంతో వారు అవాక్కయ్యారు. మొత్తం 27 పొదుపు గ్రూపులకు సంబంధించి సుమారు రూ.20 లక్షలకు పైగానే స్వాహా చేసినట్లు విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో ఆగ్రహించిన పొదుపు మహిళలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. సిబ్బందితో వాగ్వావాదానికి దిగారు. ఏడెనిమిది కంతులు బకాయి ఉన్నాయని తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మహిళలు బ్యాంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ఓ బ్యాంక్ అధికారి అండదండలతోనే కార్తీక్ ఈవ్యవహారం నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 27 గ్రూపు సభ్యులతో విచారణ పూర్తయితే ఎంత మేర స్వాహా చేశారనే విషయం బయటకు వస్తుందన ఏపీఎం చెప్పారు. ఇప్పటి వరకు ఐదు గ్రూపులు మాత్రమే విచారించామని, బుధవారం పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తర్వాత అతనిపై తమ శాఖ తరపున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.